సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం। 29। ఏప్రిల్। 2023



కళకళలాడుతున్న కందిమల్లాయపల్లె

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో కందిమల్లాయపల్లె కళకళలాడుతోంది. -IIలో..



వక్ఫ్ ఆస్తులపై రాజకీయాలొద్దు

జిల్లాలోని వక్ఫ్ ఆస్తులపై రాజకీయాలొద్దని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ ఎస్‌ఏ.కరీముల్లా పేర్కొన్నారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 427 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	485	550
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 242.10 కిలోలు

న్యూస్‌రీల్

తీర్థయాత్రలకు స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక తీర్థయాత్రల ప్యాకేజీని ప్రకటించారు. మదనపల్లె ఆర్టీసీ-1 డిపో నుంచి వచ్చే నెల 21 నుంచి తీర్థయాత్రల స్పెషల్ బస్సులు నడపనున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నందలూరు, ఒంటిమిట్ట, దేవుని కడప, బ్రహ్మంగారిమఠం, శ్రీశైలం, మహానంది, నందవరం, యాగంటి, రవ్వలకొండ, అహోబిలం క్షేత్రాలను సందర్శించి మదనపల్లెకు చేరుకుంటారన్నారు. మరిన్ని వివరాలకు ఏఎంటీ 7382875034, టీ-2 73828 76634లను సంప్రదించాలని కోరారు.

రేపు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10.00 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పొదిలి పెంచలయ్య, అసోసియేట్ అధ్యక్షులు ముద్దనూరు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈనెల 29వ తేదీ కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కొందరు ఇచ్చిన పిలుపునకు సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సచివాలయ ఉద్యోగులు తరలి రావాలని కోరారు.

కొత్త పుస్తకాలొచ్చాయ్

- విద్యా సంవత్సరం మొదట్లోనే పంపిణీకి నిర్ణయం
- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు
- మండల కేంద్రాలకు చేరిన తొలివిడత పాఠ్యపుస్తకాలు



మదనపల్లె గోదాముకు చేరిన పాఠ్యపుస్తకాలు

మదనపల్లె సిటీ: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు దారుణంగా ఉండేవి. వసతులు శూన్యం. విద్యార్థులకు సకాలాంలో పాఠ్యపుస్తకాలు అందేవికాదు. వారు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టి వందలాది బడులను బాగు చేశారు. విద్యాకానుక ఇస్తున్నారు. పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో సమస్యలు వచ్చే విద్యాసంవత్సరంలో పునరావృతం కాకుండా విద్యాశాఖ ప్రణాళికతో ముందుకెళ్లాలని నిర్ణయించుకుంది. వేసవి సెలవులు ప్రారంభం కాకముందే జిల్లా కేంద్రం నుంచి మండలాలల వారీగా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాల విభజన జరిగినప్పటికీ పాత పద్ధతిలోనే అధికారులు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి బుక్ డిపో నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాలకు పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొదటి విడతగా 12 లక్షల పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు వీటిని పూరిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆంగ్లం, తెలుగు మీడియం విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని పాఠ్యపుస్తకాలను బైలింగ్విస్ (రెండు భాషల్లో) విధానంలో ముద్రిస్తున్నారు. ఇలా ఒకే పుస్తకంలో రెండు భాషల్లో పాఠ్యాంశాలు ఉండటం వల్ల మేలు కలుగుతుంది. గతంలో ఈ విధానంలో పుస్తకాలు లేకపోవడంతో కొత్తగా ఆంగ్లమాధ్యమంలో చేరిన వారు పాఠాలు అర్థంకాక అవస్థలు పడేవారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి పాఠ్యపుస్తకాలు మారనున్నాయి. 6,7 తరగతుల గణితం, సైన్స్, ఆంగ్లం పాఠ్యపుస్తకాలు మారనున్నాయి. గత ఏడాది 8వ తరగతి పాఠ్యాంశాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేశారు. దీనికి కొనసాగింపుగా ఈ సంవత్సరం తొమ్మిదో తరగతిని కూడా మార్చుతున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి పదో తరగతి పాఠ్యాంశాలను మార్చేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. జాతీయ విద్యా విధానం ప్రకారం సీబీఎస్ఈ మోడల్‌లో పాఠ్యాంశాలను ముద్రిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పూర్తి స్థాయిలో అందజేస్తాం



ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లాకు తొలివిడతలో పాఠ్యపుస్తకా లు వచ్చాయి. వీటి ఆయా మండల ఎంఆర్సీ పరిధిలోని స్టాక్ పాయింట్‌లో ఉంచారు. విద్యా సంవత్సరం పునః ప్రారంభం వెంటనే విద్యార్థులకు వీటిని పూర్తి స్థాయిలో అందజేస్తాం.

-పురుషోత్తం, డీఈఓ,అన్నమయ్య జిల్లా

రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్ సమీకృత ప్రయోగశాల ప్రారంభించిన మంత్రి

రైల్వేకోడూరు అర్బన్: రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సమీకృత ప్రయోగశాలను ప్రభుత్వ విప్ కొరముట్లశ్రీనివాసులుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. అన్నదాతలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, నాణ్యమైన పంటలు పండించడానికి, అధికదిగుబడులు, లాభాలు సాధించే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సమీకృతప్రయోగశాలలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇందులో రైతులు వ్యవసాయ భూమిలో మట్టి, వినియోగించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, నాణ్యతా పరీక్షలు చేసుకోవచ్చాన్నారు. దీనివల్ల భూమికి తగిన పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. అవసరమైన ఎరువులు, మందులు పిచికారీ చేయవచ్చని తెలిపారు.

మార్కెట్ కమిటీతో సమావేశం

బుడుగుంటపల్లి పంచాయితీలోని ప్రభుత్వ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, డైరెక్టర్లు, అధికారులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులు మద్దతు ధరలతో సులభంగా అమ్ముకోవడనికి స్థానిక పరిస్థితులను బట్టి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులకు అనేక పథకాలు అమలు చేస్తుంటే వ్యవసాయం అంటే గిట్టని చంద్రబాబు ప్రభుత్వంపై బురద చల్లే ప్రక్రియలో భాగంగానే నిత్యం విమర్శలు చేస్తున్నారు. అల్జీమర్ వ్యాధితో బాధపడుతున్న చంద్రబాబు ఈరోజు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమం పొందిన ప్రజలు ఏదీ మరచిపోరన్నారు. అందరూ జగన్ వెంటే ఉన్నారని అన్నారు. టీడీపీ పరిపాలనలో వర్షాలు రాక, నీరులేక రైతులు వలసలు పోయారని తండ్రీ కొడుకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. పప్పు అని పేరున్న లోకేష్‌కు పంటల పేర్లు తెలీవన్నారు.కనీసం పప్పు ధాన్యాల పేర్లన్నా చెప్పగలడా అని విమర్శించారు.అంతకు మందు మంత్రి, ప్రభుత్వ విప్ గంగాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్‌నాయకులు కొల్లంగంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజంసుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, హేమణవర్మ, తోట శివసాయి, సీహెచ్‌రమేష్, మండలనాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మకు నమస్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి.చిత్రంలో విప్ కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

- విజయవంతం చేయాలి:కలెక్టర్

రాయచోటి : మే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం ''జగనన్నకు చెబుదాం''కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని, జిల్లాలో దీనిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ స్పందన అర్జీలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, జగనన్న భూహక్కు- భూ రక్ష పథకం, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, జగనన్న విద్యాకానుక, సచివాలయ సేవలు తదితర అంశాల్లో సాధించిన ప్రగతి, తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించారు. ఈ కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ గంగాధరరావు, డీఆర్ఓ సత్యనారాయణలు హాజరయ్యారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకాల లక్ష్యాల సాధనకు అధికారులు నిబద్ధతతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు.

- అన్నమయ్య జిల్లాలో పరిశ్రమలు స్థాపించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా అధికారులు, పారిశ్రామికవేత్తలకు సూచించారు. నూతన పరిశ్రమలు స్థాపించడానికి అనుమతులకు సంబంధించి ఇప్పటి వరకు 1482 దరఖాస్తులు వచ్చాయని... ఇందులో 1428 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా, ఎస్పీ గంగాధరరావు

క్లుప్తంగా

రాజంపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా శంకరయ్య



రాజంపేట : రాజంపేట స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా పసుపులేటి శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం (న్యాయ విభాగం)నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా పసుపులేటి శంకర్ స్వస్థలం ఒంటిమిట్ట. ఆయన ఆధ్యాత్మికవేత్త, న్యాయవాది, ఉత్తమ జర్నలిస్టు, ఆల్విన్ కార్మిక నాయకునిగా గుర్తింపు పొందారు. ఇటీవల న్యూఢిల్లీ కళానిలయం నుంచి స్వర్ణనంది అవార్డు అందుకున్నారు. నందలూరు బార్ అసోసియేషన్ సభ్యునిగా నందలూరు కోర్టులో ఉన్నారు. ఈ క్రమంలోనే సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా నియమితులయ్యే అవకాశం కలిగింది. ఆయన నియామకం పట్ల పలువురు మేధావులు, ప్రజాసంఘాలు, రాజకీయనేతలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన సుధాకర్‌రెడ్డి

తంబళ్లపల్లె : మండలంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బాధిత కుటుంబీకుల కథనం మేరకు... కోసువారిపల్లె పంచాయతీ జొన్నచేనుపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి (50) వ్యాపార రీత్యా తంబళ్లపల్లెలో స్థిరపడ్డారు. ఇట్నే నివారిపల్లెలో తెలిసిన వ్యక్తి అనారోగ్యం బారిన పడటంతో వారి తన సొంత బొలారో వాహనంలో తిరుపతికి తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా వాల్మీకిపురం మండలం చింతపర్తి సమీపంలో వాహనం అదుపుతప్పి చింతచెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో సుధాకర్‌రెడ్డి అక్కడికక్క డే మృతి చెందాడు. స్థానికులు 108కు సమాచా రం ఇచ్చారు. వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సందర్శించి కుటుంబీలను పరామర్శించారు. స్థానిక మండల నాయకులు, ప్రజాప్రతినిధులు.. మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



రామచంద్రారెడ్డి మృతదేహం

మదనపల్లె : ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ రామిగానిపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి (75) వ్యవసాయం చేస్తూ జీవించే వాడు. శుక్రవారం రామిగానిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ సుకుమార్ తెలిపారు. కాగా మృతుడు రామచంద్రారెడ్డికి భార్య నారాయణమ్మ, నలుగురు సంతానం ఉన్నారు.

కళకళలాడుతున్న కందిమల్లాయపల్లె

- వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు



గజ వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు



హరికథ కాలక్షేపం కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో కందిమల్లాయపల్లె(బ్రహ్మంగారిమఠం) కళకళలాడుతోంది. రెండు రోజుల నుంచి ఈ ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్ధన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మల్లయ్య, ధనలక్ష్మి, డాక్టర్ యక్కల సురేష్‌బాబు స్వప్న కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు. అనంతరం హరికథ కాలక్షేపాన్ని సిద్దు రాజ్యలక్ష్మిచే చేయించారు.

వైభవంగా గజవాహనోత్సవం

రాత్రి గజవాహనోత్సవం వైభవంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివ కుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి గుంటూరు జిల్లా బుద్దాంకు చెందిన కట్టోజు సత్యనారాయణచార్యులు, వరహాలమ్మ, విశ్వనాథాచారి, గురుస్వాములు, శివరూపాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు కాలక్షేపం కోసం మోహిని భస్మాసుర నాటకాన్ని వెంకటగిరికి చెందిన నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి మాలధారులు ఇరుముడి సమర్పణ కోసం పెద్ద ఎత్తున వస్తున్నారు. వారి ఎరుపు రంగు, కషాయ వస్త్రాధారణతోమాఢ వీధులు కళకళలాడుతున్నాయి. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్య స్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

దర్శనీయ స్థలాల వద్ద సందడి

బ్రహ్మంగారిమఠంలోని దర్శనీయ స్థలాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివసించిన గృహం, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మగుడి, కక్కయ్య మఠం, అచలానందస్వామి ఆశ్రమం, రామాలయం, వీరబ్రహ్మేంద్రాశ్రమం, బ్రహ్మంగారు పోలేరమ్మచే నిప్పు తెప్పించిన రచ్చబండ, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, ముడుమాలలోని సిద్దయ్యమఠం, అక్కంపేటలోని విభూతి నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను భక్తులు సందర్శించి తరలించారు.

బ్రహ్మంగారికి పట్టువస్త్రాల సమర్పణ



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి స్థానిక ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బ్రహ్మంగారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వనిపెంట సర్పంచ్ గౌసుల్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

స్నానఘట్టాల ప్రారంభం

స్వామి ఆరాధనోత్సవాలకు పెద్ద ఎత్తున వచ్చే భక్తుల కోసం బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ సమీపంలో తాత్కాలిక స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అత్యాధునిక పరికరం ప్రారంభం

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చెవి, ముక్కు, గొంతు (ఈ.ఎన్.టి) విభాగంలో వినికిడి పరీక్షలను చేయడానికి ఉపయోగించే ఆడియోమీటర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ భాయి, ఆర్ఎంఓ వై. శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 శ్రీకాంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ ఈ పరికరంతో చెవుడు సమస్య వున్నవారిని పరీక్షించి అవసరమైతే ఆపరేషన్‌లు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కడప ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వక్ఫ్ ఆస్తులపై రాజకీయాలొద్దు!



మసీదులో మతపెద్దలతో మాట్లాడుతున్న కరీముల్లా

బి.కొత్తకోట : జిల్లాలోని వక్ఫ్ ఆస్తులపై రాజకీయాలొద్దని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ ఎస్‌ఏ.కరీముల్లా అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట మసీదులో మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఇక్కడి మసీదుకు, ముస్లింలకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. తుమ్మనంగుట్ట మసీదు, ఖబర్‌స్థాన్‌లకు ప్రహరీగోడ నిర్మాణం, ఈద్గాహ్ నిర్మాణం పనులు జరగాల్సి ఉందని కరీముల్లా దృష్టికి తీసుకెళ్లగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం, మైనార్టీలకు ప్రాధాన్యత దక్కిందన్నారు. జిల్లాలో ఆక్రమణలకు గురైన వక్ఫ్ ఆస్తులను గుర్తిస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ, చాందుసాబ్, హైదుసాబ్, మాబుసాబ్, సయ్యద్‌మీరా, ఇమాంసాబ్, మౌలాలీ, ఖాసీంసాబ్ పాల్గొన్నారు.

ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్‌గా రవీంద్ర



డాక్టర్ రవీంద్ర

మదనపల్లె : దేశంలోనే క్షయరోగుల వైద్యసేవలకు పేరుమోసిన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(శానిటోరియం) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ కె.పి.రవీంద్రను నియమించినట్లు రాయలసీమ డయాసిస్ బిషప్ ది రైట్ రెవ.డా.పి.ఐజక్ వరప్రసాద్ తెలిపారు. రాయలసీమ డయాసిస్ బిషప్ హోదాలో ఆయన శుక్రవారం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) డైరెక్టర్ నియామకంపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. మదనపల్లెలో జరిగిన ఏఎంసీ గవర్నింగ్ బాడీ, రాయలసీమ డయాసిస్ సెంట్రల్ బోర్డు తీర్మానం మేరకు డాక్టర్ కె.పి.రవీంద్రను డైరెక్టర్‌గా నియమించాలని నిర్ణయించామన్నారు. ఏఎంసీ నూతన డైరెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వైద్యసేవల్లో తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని, రోగులకు మెరుగైన సేవలందించి సమాజసేవలో తన గుర్తింపును నిలబెట్టుకుంటుందని చెప్పారు. మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వైద్యసేవలు వినియోగించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఏఎంసీలో అధునాతన చికిత్సలకు సంబంధించి అన్ని విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న డాక్టర్.బి.వెస్లీ నూతన డైరెక్టర్ డాక్టర్.కె.పి.రవీంద్ర నియామకం చెల్లదని పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాయలసీమ డయాసిస్ బిషప్ ఏఎంసీ అసోసియేషన్, గవర్నింగ్ బాడీకి అధ్యక్షులుగా వ్యవహరించరని, ఆయన చేసిన ప్రకటన చెల్లదని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

ములకలచెరువు : ప్రయాణికుల ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఐదుగురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... బి.కొత్తకోట బీసీ కాలనీ, తాకాటంవారిపల్లెకు చెందిన పది మంది మహిళా కూలీలు తంబళ్లపల్లెకు చెందిన ఒక రైతు వ్యవసాయ పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా మండలంలోని వేపూరికోట పంచాయతీ బత్తలాపురం క్రాస్ వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి(40), రెడ్డెమ్మ(43), చంద్రకళ(37), మస్తానమ్మ(45), నందిని(30)లకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపట్టారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ నజీర్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు.

• గంగమ్మా..దీవించమ్మా..

రైల్వేకోడూరు అర్బన్ : భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మతల్లి జాతర శుక్రవారం ముగిసింది. పట్టణంలోని గంగమ్మ మిట్టలో ఉన్న గంగమ్మను వేలాది మంది ప్రజలు, భక్తులు దర్శించుకున్నారు.గంగమ్మా దీవించమ్మా అని వేడుకున్నారు. తెల్లవారుజామున 5 గంటలకు ప్రారంభమైన గంగమ్మ శోభాయాత్ర యువకుల నృత్యాల మధ్య వైభవంగా సాగింది సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్సైలు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి గంగమ్మతల్లి ఊరేగింపు



గ్రామోత్సవంలో యువకుల సందడి

ఇరు వర్గాల గొడవ

చిట్వేలి : శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని పోలోపల్లిలో రెండు సామాజిక వర్గాల మధ్య శుక్రవారం గొడవ చోటుచేసుకుంది. ఈ మేరకు రాములవారి కల్యాణ ఊరేగింపు పాత పద్దతిలో చేయాలని ఒక వర్గం, తమకూ అవకాశం ఇవ్వాలని మరో వర్గం పట్టుపడటంతో గొడవ మొదలైంది. విషయం తెలుసుకున్న సీఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు గొడవను అదుపు చేశారు. గ్రామస్తులు సమన్వయంతో వ్యవహరించాలని సీఐ సూచించారు. గ్రామంలో సామాన్య పరిస్థితులు నెలకొనే వరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు డైరెక్టర్ల నియామకం

కలసపాడు : జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర డైరెక్టర్ పదవులు లభించాయి. కలసపాడు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన పోకల రామకృష్ణారెడ్డి టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఐటీ వింగ్ చల్లామధుసూదన్‌రెడ్డి, టూరిజం శాఖ రాష్ట్ర చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్ఎస్ఎమ్ఈ డైరెక్టర్‌గా చల్లా వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా చెన్నూరు మండలం ఓబుళంపల్లి గ్రామానికి చెందిన చల్లా వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఓబుళంపల్లి ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేశారు. ఈ అవకాశం కల్పించిన కమలాపురం శాసనసభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.